క్లుప్తంగా

ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు రూరల్ మేడికొండూరులోని ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలకు కాకినాడ జేఎన్‌టీయూ నుంచి స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా పొందినట్లు కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు చెప్పారు. విద్యార్థులకు ఆధునిక సదుపాయాలతో అందిస్తున్న నాణ్యమైన సాంకేతిక విద్యాబోధన, ప్లేస్‌మెంట్స్, వసతుల్ని పరిగణలోకి తీసుకుని జేఎన్‌టీయూకే స్వయం ప్రతిపత్తి హోదా కల్పించిందని తెలిపారు. జేఎన్‌టీయూకే క్యాంపస్‌లో గురువారం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఎల్.సుమలత చేతుల మీదుగా స్వయం ప్రతిపత్తి హోదా ధ్రువ పత్రాన్ని అందుకున్నట్లు తిలక్ బాబు వివరించారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్ (వీఎల్ఎస్ఐ) అనే నూతన చిప్ డిజైనింగ్ కోర్సుకు అనుమతి లభించినట్లు తెలిపారు. స్పెషలైజ్డ్ కోర్సుగా ఉన్న వీఎల్ఎస్ఐ కోర్సును పూర్తి చేయడం ద్వారా సీఎస్ఈ కంటే మెరుగైన ప్యాకేజీతో పాటు ఉద్యోగావకాశాలు సులువుగా పొందే అవకాశమున్నట్లు పేర్కొన్నారు. ఒకే ఏడాది తమ కళాశాల నాక్ ఏ ప్లస్, అటానమస్ హోదా రావడం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాస్, ఏవో సీతారామయ్య, ఎంబీఏ విభాగాధిపతి రెహ్మాన్, వేణు పాల్గొన్నారు.

ఖాతాలో నగదు మాయంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఖాతాలో నగదు మాయంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. సాయినగర్ 5వ లైనులో నివసించే విజయ కాళీ అనే మహిళకు ఏటీ అగ్రహారంలోని యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఉంది. జూన్‌లో ఖాతాలోకి రూ. 30 వేలు మూడు విడతలుగా ఆమె ప్రమేయం లేకుండా విత్‌డ్రా అయ్యాయి. ఆలస్యంగా గుర్తించిన ఆమె గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

గుంటూరు ఈస్ట్: పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్‌లో జిల్లా ఐక్యకార్యాచరణ సమితి ఆధ్వర్యంలో గురువారం భోజన విరామ సమయంలో తమ సమస్యల్ని యాజమాన్యం పరిష్కరించాలని కోరుతూ సిబ్బంది నిరసన తెలిపారు. జేఏసీ చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు తమ న్యాయమైన కోర్కెల్ని సంవత్సరంగా యాజమాన్యం దృష్టికి తీసుకు వెళ్తున్నప్పటికీ పరిష్కరించడం లేదని తెలిపారు. అవసరమైతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజేష్ కన్నా, కన్వీనర్ రవిశంకర్ పాల్గొన్నారు.

గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ సీఐగా ఎం.శ్రీనివాసరావు



పట్నంబజార్: గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ సీఐగా ఎం.శ్రీనివాసరావు గురువారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రకాశం జిల్లాలోని పలు స్టేషన్లలో పనిచేశారు. 2021లో ఆయనకు సీఐగా పదోన్నతి లభించింది. కొండెపిలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన్ను గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ సీఐగా నియమిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ట్రాఫిక్ సీఐగా పనిచేసిన నిసార్ బాషాను వీఆర్‌కు పంపుతూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

గంజాయి తాగుతున్న ముగ్గురిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: గంజాయి తాగుతున్న ముగ్గురిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యానగర్‌లోని ఓ హోటల్‌లో యువకులు గంజాయి తాగుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు గురువారం దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో వన మహోత్సవం

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములవ్వాలని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. చౌడవరం లోని కళాశాలలో గురువారం వన మహోత్సవం నిర్వహించారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో సిబ్బంది మొక్కలు నాటారు. కళాశాల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ చూడాలని తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా వాటిని పరిరక్షించాలన్నారు. ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మొక్కల పెంపకం ఆవశ్యకతను తెలియజేస్తూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.సుధాకర్, డాక్టర్ జి.రామ్మోహన్ బాబు, డాక్టర్ రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



లబ్ధిదారునికి ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గిరిధర్, బాల వజ్రబాబు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజలందరికీ సంక్షేమ పథకాల్ని అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం 52, 38వ డివిజన్ల పరిధిలోని అరండల్‌పేట, కుందుల రోడ్డులో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజలకు వాటిని అందజేశారు. ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని అర్హులైన చిట్టచివరి లబ్ధిదారుని వరకు చేర్చడమే లక్ష్యంగా సీఎం వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు పర్చిన ఏకైక ముఖ్యమంత్రిగా ఆయన అర్హత ఉండీ సాంకేతిక కారణాలతో లబ్ధి పొందలేకపోయిన ప్రజలకు లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. 100 శాతం సంక్షేమం అందించాలనే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. చిన్నచిన్న సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందని వారిని గుర్తించి, లబ్ధి చేకూర్చడం, ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాల్ని అందించడంతో పాటు సమస్యల్ని పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.
సంక్షేమ పథకాల్ని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందించాలనే లక్ష్యంతో కిందిస్థాయిలో ఉన్న సమస్యలు, లోపాల్ని తొలగించి పేదలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, 38వ డివిజన్ ఇన్‌చార్జ్ బోగిసం ప్రసాద్, 52వ డివిజన్ కార్పొరేటర్ మల్లిబోయిన శ్రీవల్లి, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మొహమ్మద్ బాబుఖాన్, యేరువ ఇన్నారెడ్డి, గజ్జల గోపి, కడియం రామకృష్ణ, రామిశెట్టి జ్యోత్స్న, కృష్ణకాంత్, సుబ్బారావు, కోటిరెడ్డి, కవిత గురవయ్య, మరియమ్మ, రఫీ, రాంబాబు, నగరపాలకసంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అదనపు ఓపీ కౌంటర్లకు శంకుస్థాపన

ముందుకు వచ్చిన పలువురు దాతలు



ప్లాస్టిక్ సర్జరీ వైద్యులను అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ అవుట్ పేషెంట్ విభాగంలో (ఓపీ) రోగుల పేర్లు నమోదు కోసం నూతనంగా ఏర్పాటు చేయనున్న 10 కేంద్రాలకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ గురువారం ప్రత్యేక పూజలు చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీజీహెచ్ ఓపీ విభాగానికి ప్రతిరోజూ రెండు వేల నుంచి మూడు వేల మంది వరకు రోగులు రావడంతో కిటకిటలాడుతోందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆరు ఓపీ పేర్ల నమోదు కౌంటర్లు సరిపోకపోవడంతో మరో 10 ప్రారంభించాలని భావించినట్లు చెప్పారు. ఈ కేంద్రాలు అందుబాటులో వస్తే రోగులకు ఎంతో ఉపయోగం కలుగుతుందని తెలిపారు. కేంద్రాలకు ఆర్థిక సాయం చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆసుపత్రిలో పని చేసే ఉద్యోగి శివారెడ్డి రూ.5వేలు ప్రకటించడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్. శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ కిరణ్మయి, ఇంజినీరింగ్ అధికారులు రత్తయ్య, సత్యం పాల్గొన్నారు.

పలు వార్డుల తనిఖీ

ఆసుపత్రిలో కాన్పుల వార్డును సూపరింటెండెంట్ గురువారం తనిఖీ చేశారు. సేవల గురించి గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. వార్డును పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఐసీయూలో శుభ్రత లోపించడం, పీజీ వైద్య విద్యార్థులకు డ్రెస్ కోడ్ లేకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ బాలుడికి ఆర్థిక సాయం చేశారు. సమయపాలన పాటించాలని ఆరోగ్యమిత్రలో పని చేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఆదేశించారు. పనితీరును మెరుగు పర్చుకోవాలని సూచించారు. ఆయన వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్ ఉన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి రెండేళ్లుగా రోగి పడుతున్న సమస్యల్ని తొలగించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ గురువారం వైద్యుల్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు స్వర్ణభారతీనగర్‌కు చెందిన జె. నాగరాజు రెండేళ్ల కిందట కోవిడ్‌కు గురైనట్లు తెలిపారు. కోలుకున్న తర్వాత బ్లాక్ ఫంగస్ సోకి దంత సమస్యలు ఏర్పడటంతో అనేక ఇబ్బందులకు గురయినట్లు వెల్లడించారు. ఆహారం మింగలేక పోవడం, మాట సరిగా రాకపోవడంతో అవస్థలకు గురయినట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్ని సంప్రదిస్తే చికిత్సకు కనీసం ఎనిమిది లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారన్నారు. రోగి కుటుంబ పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో ఈ నెల 11న జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి వచ్చినట్లు చెప్పారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గంగా భవాని, డాక్టర్ చంద్రలేఖ, డాక్టర్ నజ్మ, డాక్టర్ విజయ, డాక్టర్ నిఖిల్, డాక్టర్ నవ్య, డాక్టర్ నిశాంత్ ఆధ్వర్యంలో రోగి చేతి నుంచి కండ తీసి పై దవడ, ముఖంలో రక్తనాళాల్ని కలిపి మైక్రో సర్జరీ ద్వారా రెండేళ్ల సమస్య నుంచి విముక్తి కల్పించారని వివరించారు. ఆపరేషన్ చేసేందుకు ఆరు గంటలు పట్టిందని చెప్పారు. నాగరాజు బాగా మాట్లాడుతున్నాడని, ఆరోగ్యంగా ఉండటంతో గురువారం డిశ్చార్జి చేస్తున్నామని తెలిపారు. ఆపరేషన్‌లో పాల్గొన్న మత్తు వైద్యులు డాక్టర్ నాగభూషణం, డాక్టర్ ఆనంద్, డాక్టర్ రామరాజులను, ప్లాస్టిక్ సర్జరీ వైద్యుల్ని సూపరింటెండెంట్ అభినందించారు. నాగరాజు అకౌంట్‌లో ఆసరా పథకం కింద తొమ్మిది వేల రూపాయల్ని వేసినట్లు చెప్పారు. పనులు చేయలేని పరిస్థితిలో ఆ సొమ్ము వేలు ఎంతో ఉపయోగపడుతుందని వెల్లడించారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఆర్థిక సాయం

జీజీహెచ్‌లో పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న మిరియాల జెస్సి మేరీ, నల్లకాల్వ లక్ష్మి భర్తలు ఇటీవల వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందారు. దీంతో ఆ రెండు కుటుంబాలు పేదరికంతో ఇబ్బందులు పడుతున్నాయి. విషయం తెలుసుకున్న సహచర పారిశుద్ధ్య కార్మికులు ఒక్కొక్క కుటుంబానికి రూ.40 వేలు చొప్పున ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. కలసికట్టుగా డబ్బుల్ని సేకరించారు. ఆసుపత్రిలోని పారిశుద్ధ్య కార్యాలయం వద్ద గురువారం బాధిత కుటుంబాలకు సూపరింటెండెంట్ రూ. 80 వేలను అందజేశారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్లు ఆశా సజని, కిరణ్మయి, ఏజైల్ పారిశుద్ధ్య గ్రూప్ ప్రతినిధులు సురేంద్ర, మోహన్ కుమార్, శివరామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఫీజుల చెల్లింపు



గుంటూరు ఎడ్యుకేషన్: టీజేపీఎస్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న ముగ్గురు పేద విద్యార్థుల ఫీజుల్ని పూర్వ విద్యార్థి తిరుమలశెట్టి రాజశేఖర్ చెల్లించారని ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పూర్వ విద్యార్థి రాజశేఖర్ ఎంతో ఔదార్యంతో తాను విద్యను అభ్యసించిన కళాశాలలో ఆయన తల్లి తిరుమలశెట్టి విజయలక్ష్మి పేరుపై పేద విద్యార్థులకు ఫీజుల్ని చెల్లించడం అభినందనీయమన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి మొహ్మద్ ఖాసీం, సీఈసీ విద్యార్థిని ఎం. స్పందన, సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థిని కె. సుబ్బాయమ్మ ఫీజుల్ని చెల్లించినట్లు వివరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులంతా కష్టపడి చదివి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించిన పూర్వ విద్యార్థి రాజశేఖర్‌ను కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, జి. సురేష్‌కుమార్, కాశీరత్నం పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు

కమిషనర్ కీర్తి చేకూరి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఎల్.ఆర్ కాలనీ, రాజీవ్‌గాంధీ నగర్ తదితర ప్రాంతాల్లో డోర్ టు డోర్ ఓటర్ సర్వేని బుధవారం అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, సూపర్‌వైజర్లతో కలసి ప్రత్యక్షంగా పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ఎల్.ఆర్ కాలనీ 203 పోలింగ్ స్టేషన్ బీఎల్‌ఓ జి.రమేష్‌బాబు, రాజీవ్‌గాంధీ నగర్ 46 పోలింగ్ స్టేషన్ బీఎల్‌ఓ బి.రఘుబాబుని విధుల నుంచి సస్పెండ్ చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్- 2024 ఓటర్ల జాబితాకి సంబంధించి డోర్ టు డోర్ సర్వేను బీఎల్‌ఓలు పక్కాగా చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సూపర్‌వైజర్లు మరింత బాధ్యతగా సర్వేని పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సర్వేలో ప్రధానంగా ఒకే డోర్ నంబర్‌లో ఎక్కువ ఓట్లు ఉన్నా, జీరో డోర్ నంబర్ ఉన్న వాటిని, జంక్ క్యారెక్టర్లు ఉన్న వాటిని ప్రత్యేకంగా పరిశీలన చేయాలని తెలిపారు. వయస్సు 100పై బడిన వారి ఓటర్ల వయస్సు ధ్రువీకరణ పత్రాల్ని పరిశీలించాలని చెప్పారు. బీఎల్‌ఓ యాప్‌లో సమస్య ఎదురైతే వెంటనే నగరపాలక సంస్థ ఎన్నికల విభాగ సిబ్బందిని సంప్రదించాలని కమిషనర్ సూచించారు. బీఎల్‌ఓలంతా నగరపాలక సంస్థ గుర్తింపు కార్డులను ధరించి సర్వేలో పాల్గొనాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, రవీంద్ర, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ పద్మ పాల్గొన్నారు.

పనుల్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయాలని, ఇంజినీరింగ్ అధికారులు కూడా పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శ్యామలానగర్ రోడ్డులోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం స్విమ్మింగ్ పూల్, ఉద్యోగ నగర్, ఎస్‌వీఎన్ కాలనీ పార్క్‌లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పార్క్‌లు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు టెండర్ పొంది పనులు నిర్దేశిత గడువు మేరకు చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అటువంటి కాంట్రాక్టర్లపై, పర్యవేక్షణ ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. శ్యామలానగర్ రోడ్డులోని మున్సిపల్ స్విమ్మింగ్ పూల్ ప్రాంతంలో పార్క్ అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఏఈని ఆదేశించారు. ఉద్యోగ నగర్ పార్క్‌లో పనులకు ఆమోదం వచ్చినా ఇంకా ప్రారంభించక పోవడంపై ఇంజినీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సోమవారం నుంచి ప్రారంభించాలని స్పష్టం చేశారు. పార్క్ ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణంపై స్థానికుల ఫిర్యాదు మేరకు ఆమె పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేని పక్షంలో కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించబోమని తెలిపారు. ఎస్‌వీఎన్‌కాలనీ పార్క్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పెట్టాలని, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఎక్విమెంటుకు మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి.రవీంద్ర, ఈఈ సుందరరామిరెడ్డి, ఏడీహెచ్ రామారావు, డీఈఈ మహ్మద్ రఫిక్, ఎస్ఎస్ సోమ శేఖర్, ఏఈ సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు భాస్కర్, డేవిడ్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన భవనంలోకి యనమదల సీజీజీబీ బ్రాంచి మార్పు



బ్రాంచిని ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్

కొరిటెపాడు(గుంటూరు): ఖాతాదారులకు లాకర్ సదుపాయాలతో మరిన్ని సేవలు అందించేందుకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ గుంటూరు రూరల్ మండలం, యనమదల శాఖ విశాలమైన నూతన భవనంలో గురువారం కొలువుదీరింది. బ్రాంచిని డీఆర్‌డీఏ పీడీ వై.హరిహరనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు అందించటంలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మార్కెట్ పరిస్థితులకు అతీతంగా సమాజంలో అన్ని వర్గాల కష్టమర్లకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేందుకు డిపాజిట్లపై అత్యధికంగా 8.75 శాతం వడ్డీ సీజీజీబీ అందిస్తోందని వివరించారు. సీజీజీబీ జనరల్ మేనేజర్ పి.మారుతీరాం మాట్లాడుతూ బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.18 వేల కోట్లు అధిగమించిందని వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ.89 కోట్ల నికర లాభం సాధించినందుకు ఖాతాదారులకు అభినందనలు తెలిపారు. విదేశాలలో ఉన్నత చదువుల కోసం బ్యాంకు గడిచిన రెండు ఏళ్లలో 600 మంది గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. రైతుల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ఎలాంటి తనఖా లేకుండా రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించబోతున్నట్లు వెల్లడించారు. బంగారు ఆభరణాల తనఖాపై గ్రాముకు అత్యధికంగా రూ.4,350 వరకు అందిస్తున్నామని చెప్పారు. రైతులు, మహిళల సాధికారత కోసం బ్యాంక్ పాటుపడుతోందని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి.వీరారెడ్డి, బ్యాంక్ ప్లానింగ్ మేనేజర్ కె.ఆంజనేయులు, బ్రాంచ్ మేనేజర్లు వై.శ్రావణ్, కె.శ్రీకాంత్, పలువురు ఖాతాదారులు, విశ్రాంత ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ఆదర్శనీయం కలాం సేవలు

- వీసీ ఆచార్య పి. రాజశేఖర్
- ఏఎన్‌యూలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి



యూనివర్సిటీలో కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ తదితరులు

ఏఎన్‌యూ: సాధారణ స్థాయి నుంచి ప్రపంచంలోనే అత్యున్నత స్థాయికి ఎదిగిన ఏపీజే అబ్దుల్ కలాం యువతకు ఎప్పటికీ ఆదర్శనీయులేనని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ పేర్కొన్నారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ కలాం వర్ధంతి సందర్భంగా గురువారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని కలాం విగ్రహానికి వీసీ, యూనివర్సిటీ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కలలు కనడమే కాదు వాటిని సాకారం చేసుకోవడానికి ఎలా ముందుకుసాగాలో ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి కలాం అని కొనియాడారు. రాష్ట్రపతిగానే కాకుండా శాస్త్రవేత్తగా దేశ రక్షణ, సాంకేతిక రంగాల్లో ఆయన విలువైన సేవలు అందించారని తెలిపారు. రక్షణ, అంతరిక్ష ప్రయోగ రంగాలలో భారత దేశాన్ని ప్రపంచంలోనే ఉన్నత స్థాయిలో నిలిపేందుకు ఆయన చేసిన కృషి ఎప్పటికీ ఆదర్శనీయమని కొనియాడారు. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు కూడా బోధన, నూతన అంశాలపై విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించడం, వారిలో నైతిక విలువలు పెంపొందించడం వంటి అంశాలకు కలాం అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఆయన చివరి క్షణాలు కూడా విద్యార్థుల మధ్యే గడవడం ఆయనకు వారిపై ఉన్న మక్కువను తెలియజేస్తుందని వివరించారు. ఆయన ఆశయ సాధనకోసం విద్యార్థులు కృషి చేయాలని వీసీ సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, యూనివర్సిటీ అధికారులు ఆచార్య ఎల్. ఉదయకుమార్, డాక్టర్ నాగరాజు, ఆచార్య శ్రీనివాసరెడ్డి, డాక్టర్ నాగకిశోర్, డాక్టర్ గోపీకృష్ణ, యూనివర్సిటీ ఇంజినీర్ కుమార్‌రాజు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికి గర్వకారణం అబ్దుల్ కలాం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచస్థాయిలో గొప్ప శాస్త్రవేత్తగా గుర్తింపు పొందిన అబ్దుల్ కలాం భారతదేశానికి గర్వకారణమని కలాం యువ ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ పిడికిటి భూపాల్ పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో గురువారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న భూపాల్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పితామహునిగా అబ్దుల్ కలాం రక్షణ, అంతరిక్ష పరిశోధన రంగాల్లో దేశాన్ని అగ్రభాగాన నిలిపారని పేర్కొన్నారు. వ్యవసాయం, పర్యావరణ రంగాలపై అమితాసక్తితో పాటు పుస్తక పఠనం, సామాజిక బాధ్యత కలబోసిన అబ్దుల్ కలాం కుటుంబ వాతావరణం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం కలాం సాధించిన విజయాలతో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రపతిగా కలాం విశిష్ట సేవలు

నెహ్రూనగర్: భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాల్ని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని డెప్యూటీ మేయర్ షేక్ సజీల సూచించారు. అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకొని గురువారం మాయాబజార్‌లోని డెప్యూటీ మేయర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్రవేత్తగా కలాం ఎన్నో ప్రయోగాల్ని విజయవంతం చేసి దేశానికి పేరు ప్రఖ్యాతలతో పాటు, రాష్ట్రపతిగా ఎన్నో విశిష్ట సేవలందించారని కొనియాడారు.

కలాం ఆశయాలు నేటి యువతకు ఆదర్శనీయం

మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలు నేటి యువతకు ఆదర్శనీయమని కార్పొరేటర్లు పేర్కొన్నారు. గురువారం తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ ఓ సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించి, నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాల్ని అధిరోహించిన కలాం జీవన ప్రస్థానం ప్రతి భారతీయునికి ఆదర్శనీయమని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అజయ్, మీరావలి, ఆబీద్ బాషా, సంకూరి శ్రీను, వైఎస్సార్ సీపీ తూర్పు మహిళా నాయకురాలు నూరి ఫాతిమా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు

నెహ్రూనగర్: రాష్ట్రంలో సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల వారికి అందుతున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. 54వ డివిజన్‌లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి అగ్గిపెట్టె రాజు ఆధ్వర్యంలో డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకులు సయ్యద్ ఖాశిం, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, మేడ ఫణి, దూపాటి నాని, కుర్ర ఆదిత్య, దూపాటి దేవరాజ్, అరవ డాని, ఇబ్బిలి చందు, ఎం. కల్యాణ్ వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో నగరంలో ఎక్కడా సరైన అభివృద్ధి జరగలేదని, కేవలం గ్రాఫిక్స్ నిర్మాణాలకే పరిమితం చేశారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేయడం, కుల, మత పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడంతో ప్రతిపక్ష నాయకులు వైఎస్సార్ సీపీ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తూర్పు మహిళా నాయకురాలు నూరి ఫాతిమా, మల్లవరపు దాసు, చిలకా కృపయ్య, దీప్తి, కృష్ణ, సుబ్బారావు, కోటేశ్వరమ్మ, శిరీష, సుబ్బారావు, అచ్చమ్మ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పెదకాకాని: ఎలుకల మందు తిని వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పెదకాకానిలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ కాలేశావలి, రజియా దంపతులు స్థానిక దర్గా వద్ద నివాసం ఉంటున్నారు. మనస్పర్థలతో వీరు కొంతకాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె మొహనాజ్ భర్తతో గొడవపడి పుట్టింటి వద్దే ఉంటోంది. పది రోజుల క్రితం అదే ప్రాంతంలో నివశిస్తున్న తన మేనత్త హజరబీ ఇంటికి మొహనాజ్ వెళ్లింది. రాత్రి నిద్రపోతున్న సమయంలో హాజరబీ భర్త అమీర్ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు వివరించింది. కానీ, వారు పట్టించుకోకపోవడంతో మొహనాజ్ రెండు రోజుల క్రితం ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు.. గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

డిగ్రీ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు

ఆచార్య ఈదర శ్రీనివాసరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ నూతన విద్యా విధానంతో డిగ్రీ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల డీన్ ఆచార్య ఈదర శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గురువారం జాతీయ నూతన విద్యా విధానం–2020పై అధ్యాపకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం నుంచి డిగ్రీ విద్యార్థి ఒక మేజర్ సబ్జెక్టు, ఒక మైనర్ సబ్జెక్టు ఎంపిక చేసుకోవాల్సి ఉందని చెప్పారు. విద్యతో పాటు నైపుణ్యాల్ని పెంపొందించే విధంగా కోర్సులు రూపకల్పన చేశారని తెలిపారు. వీటిని ప్రవేశపెట్టేందుకు ప్రధాన కారణం విద్యార్థులు త్వరగా ఉద్యోగాల్లో స్థిరపడాలనేది ముఖ్యోద్దేశంగా వివరించారు. ఆనర్స్ డిగ్రీ కోర్సులో విద్యార్థి మొదటి ఏడాది వరకే చదివితే ఒక సంవత్సరం సర్టిఫికెట్, రెండు సంవత్సరాలు చదివితే డిప్లొమా సర్టిఫికెట్, మూడు సంవత్సరాలు చదివితే డిగ్రీ సర్టిఫికెట్, పూర్తిగా నాలుగేళ్లు చదివితే ఆనర్స్ సర్టిఫికెట్‌ను యూనివర్సిటీ ప్రదానం చేస్తుందని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి అధ్యాపకులే కారకులవుతారని తెలిపారు. డిగ్రీ, పీజీ క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్ ఏబీపీ మనోహర్, డాక్టర్ ఎస్.అనితాదేవి, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ కె. శాస్త్రి పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రమంలో నీడ



గుంటూరు మెడికల్: నడిరోడ్డుపై వదిలివెళ్లిన వృద్ధురాలిని గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తొలుత ఆమెకు చికిత్స చేయించి తదుపరి ఆశ్రమంలో చేర్పించారు. గుంటూరు మార్కెట్ సెంటర్‌లో మూడు రోజుల కిందట సుమారు 65 సంవత్సరాల వృద్ధురాలిని ఒంటరిగా వదిలివెళ్లారు. ఈ విషయం ట్రస్ట్ సభ్యులకు తెలియజేయటంతో వారు ఆమెను గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించి వైద్యం చేయించారు. ఆరోగ్యం కుదుటపడటంతో గురువారం పొన్నూరులోని గోతాలస్వామి ఆశ్రమంలో చేర్పించారు. రోడ్లపై అనాథలుగా ఎవరైనా కనిపిస్తే తమకు సమాచారం అందిస్తే వారికి ఆశ్రయం కల్పిస్తామని ట్రస్ట్ నిర్వాహకులు పఠాన్ అల్లాబక్షు తెలిపారు. ట్రస్ట్ సేవల్ని వినియోగించుకోవాలనుకునే వారు 8143222456, 9397602553 నంబర్స్‌లో సంప్రదించాలని సూచించారు.